రైతులకు అండగా ప్రభుత్వం: మంత్రి పొన్నం

ముల్కనూరులో మహిళా రైతులతో ముచ్చటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, ఆగస్టు 3: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని ముల్కనూర్ గ్రామ శివారులో వరి నాట్లు వేస్తున్న మహిళలతో శనివారం ఆయన ముచ్చటించారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రూ.1.50 లక్షల వరకు రుణ మాఫీ చేశామన్నారు. త్వరలోనే రెండు లక్షలు మంజూరు అవుతాయన్నారు. రేషన్ కార్డులు చాలా కాలంగా రావడంలేదని మహిళలు అడుగగా, త్వరలోనే రేషన్ కార్డులతో పాటు ఆరోగ్యశ్రీ కార్డులు ప్రభుత్వం అందజేస్తుందని వారికి తెలిపారు. వరి పొలాల్లో మహిళలు పాడుకునే పాటలను మంత్రి ఆసక్తిగా విన్నారు. సుందరగిరిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు కరచాలనం చేసి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానానికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను మంత్రి పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పంది తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, రవీందర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, వేణు, రాములు నాయకులు, అధికారులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సైదాపూర్, ఆగస్టు 3: దుద్దనపల్లి గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుండారపు శ్రీనివాస్ తల్లి గుండారపు కనకమ్మ, సైదాపూర్‌కు చెందిన అనగోని లక్ష్మయ్య, అనగోని లక్ష్మి, జాగీర్‌పల్లికి చెందిన బండారు భూమక్క ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు ఉన్నారు.

పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

వీసీలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు

- కొత్త ఆర్‌వోఆర్ చట్టం అమలులోకి వచ్చే లోగా పెండింగ్ ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి
- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

కలెక్టరేట్, ఆగస్టు 3 : పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం ఆర్‌వోఆర్ చట్టం, పెండింగ్ భూ సమస్యల అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు రూపొందించి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. సెక్షన్ 4 ప్రకారం కొత్త ఆర్‌వోఆర్ రికార్డుల రూపకల్పన, అందుబాటులో ఉన్న రికార్డుల సవరణకు అవకాశం ఉన్నదని వెల్లడించారు. సాదాబైనామా కింద చేసుకున్న దరఖాస్తుల పరిష్కారానికి సెక్షన్ 6 వెసులుబాటు కల్పించిందన్నారు. సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో ముసాయిదా బిల్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దీనిపై ప్రజలు తమ సలహాలు, సందేహాలు, అభిప్రాయాలను సీసీఎల్ఏ వెబ్‌సైట్ 'www.ccla.telangana.gov.in ద్వారా లేదా ror-rev@telangana.gov.in మెయిల్ ద్వారా గాని, కార్యాలయంలో దరఖాస్తు ద్వారానైనా ఈనెల 23లోగా తెలియజేయవచ్చని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్లు, రెవెన్యూ డివిజన్ అధికారులు నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు సకాలంలో అందజేయాలని సూచించారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టం అమలులోకి వచ్చే లోపు పెండింగ్ ధరణి దరఖాస్తులు పరిష్కరించాలని, మరో మూడు వారాల వ్యవధిలో పూర్తి స్థాయిలో ధరణి అర్జీలు పరిష్కారమయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ధరణి ద్వారా వచ్చే దరఖాస్తులు తిరస్కరించే పక్షంలో విధిగా తగిన కారణాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతితో పాటు డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేశ్, పలు మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేత కార్మికుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామడుగు, ఆగస్టు 3 : మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన నేత కార్మికుడు మిట్టపెల్లి రమేశ్ రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకోగా, శనివారం భాదిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. రమేశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల నాయకులు ఉన్నారు.

అర్కండ్లలో వంతెన కోసం కేంద్ర మంత్రికి వినతి

శంకరపట్నం, ఆగస్టు 3: అర్కండ్ల వాగుపై వంతెన నిర్మించాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ చేర్ల అనితాశ్రీనివాస్ స్థానిక నాయకులతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం కరీంనగర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా, వంతెన నిర్మాణానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రధాన శాస్త్రవేత్త మంజులత

ముకరంపుర, ఆగస్టు 3: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జీ మంజులత పేర్కొన్నారు. పరిశోధన స్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన వన మహోత్సవంలో శాస్త్రవేత్తలతో కలిసి పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది విజయ్ భాస్కర్, ఉషారాణి, మధుకర్, శ్రావణి, మదన్ మోహన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పారమితలో వ్యవస్థాపక దినోత్సవం

చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ప్రసాద్ రావు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 3 : జిల్లా కేంద్రంలోని పారమిత విద్యాసంస్థల్లో పాఠశాలల అధినేత డాక్టర్ ఈ ప్రసాద్ రావు పుట్టిన రోజును పురస్కరించుకొని వ్యవస్థాపక దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రసాద్ రావు కేక్ కట్ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

'బ్లూబెల్స్'లో రెయిన్ డే వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 3 : జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో శనివారం రెయిన్ డే వేడుకలు అట్టహాసంగా సాగాయి. పాఠశాల ప్రాంగణాన్ని గొడుగులు, ఇంద్ర ధనస్సు, కృత్రిమ మేఘాలతో అందంగా అలంకరించారు. ప్రీ ప్రైమరీ చిన్నారులందరూ రంగురంగుల గొడుగులు పట్టుకొని, రెయిన్ కోట్‌లు ధరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జంగ సునీతామనోహర్ రెడ్డి.. వర్షాల వల్ల కలిగే ఉపయోగాలు, వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వింధ్యావ్యాలీలో..

కొత్తపల్లి, ఆగస్టు 3 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాలలో శనివారం రెయిన్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ఈ వేడుకలను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్నారులకు వర్షాల వల్ల కలిగే లాభాలు, తడిస్తే వచ్చే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో వింధ్యావ్యాలీ పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాప శ్రీనివాస్ రెడ్డికి ఉద్యమకారుల నివాళి

అలుగునూర్ చౌరస్తాలో శ్రీనివాస్ రెడ్డి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 3 : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్ చౌరస్తా వద్ద తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్ రెడ్డికి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ ఎడ్ల జోగిరెడ్డి హాజరై, తెలంగాణ ఉద్యమంలో ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సల్ల శారదా రవీందర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, కాల్వ మల్లేశం, ముప్పిడి నరసింహారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, మామిడి వెంకన్న, మామిడి మొగిలి, కుడిది శ్రీనివాస్, కనకం సాగర్, చంద్రమౌళి, శ్రీధర్, కూనమల్ల మల్లేశం, కన్కం శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాకతీయ ఒలింపియాడ్'లో బోనాల వేడుకలు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 3 : జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలింపియాడ్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు అమ్మవారి వేషధారణతో ఆకట్టుకున్నారు. లక్ష్మీనగర్ నుంచి కమాన్ మీదుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికికీ పాఠశాల కరస్పాండెంట్ వీ కామేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ అజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

అల్ఫోర్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 3 : అల్ఫోర్స్ బాలికల ఇ-టెక్నో పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులు 'పట్టు, నూలు' పాఠ్యాంశాన్ని ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు కొత్తపల్లి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి క్షేత్రాన్ని సందర్శించారు. ఇక్కడ విద్యార్థులు వస్త్ర తయారీ విధానం, ముడి సరుకు రంగుల అద్దకం, మరమగ్గాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అభినందించారు.

'సెయింట్ జార్జ్'లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే

కొత్తపల్లి, ఆగస్టు 3 : నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ), విద్యానగర్‌లోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్‌లో ముందస్తు ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు స్వయంగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ తయారు చేసి స్నేహితులకు కట్టి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డా. ఫాతిమారెడ్డి, ప్రిన్సిపల్స్ భార్గవ్, నిరంజన్, సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థ పాఠశాలలో విద్యార్థి నాయకుల ఎంపిక

చొప్పదండి, ఆగస్టు 3: పట్టణంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో వివిధ విభాగాలకు విద్యార్థి నాయకుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రతిభ ఆధారంగా స్కూల్ హెడ్‌బాయ్, స్కూల్ హెడ్ గర్ల్, స్పోర్ట్స్ హెడ్ బాయ్, స్పోర్ట్స్ హెడ్ గర్ల్‌తో పాటు నాలుగు విభాగాలకు హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌లను ఎంపిక చేసి వారికి హౌస్ బ్యాడ్జిలను అందజేసి అభినందించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేకొండ రజక సంఘం కమిటీ ఎన్నిక

చిగురుమామిడి, ఆగస్టు 3: రేకొండ గ్రామంలో ఆదర్శ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుడ్డెల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా రాచర్ల రంగయ్య, ప్రధాన కార్యదర్శి దుడ్డెల అనిల్, కోశాధికారిగా దుడ్డెల సమ్మయ్య, కార్యవర్గ సభ్యులుగా కొత్తపల్లి పరశురాములు, దుడ్డెల శ్రీనివాస్, నాంపల్లి శ్రీధర్, దుడ్డెల రాజేందర్, గౌరవాధ్యక్షులుగా దుడ్డెల సదానందం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రజకుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 3: పట్టణంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, జిల్లా స్పెషల్ కోర్టు ట్రయల్స్ 5వ అదనపు న్యాయమూర్తి కుమార్ వివేక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీల యోగ క్షేమాలపై ఆరా తీశారు. వంటగది, భోజన వసతి, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట హుజూరాబాద్ మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, సబ్ జడ్జి వెంకటేశ్, మొదటి అదనపు మెజిస్ట్రేట్ పద్మ సాయితో పాటు జైలు సూపరింటెండెంట్, సిబ్బంది ఉన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి: ఎస్ఈ వీ గంగాధర్

ముకరంపుర, ఆగస్టు 3: నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ శ్రమించాలని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం బిల్లింగ్, ట్రాన్స్ ఫార్మర్ల వైఫల్య నియంత్రణ, కొత్త సర్వీసులను త్వరగా రిలీజ్ చేయడం, ట్రిప్పింగ్స్‌ను నియంత్రించడం, రెవెన్యూ వసూళ్లు, పనులను వేగవంతంగా పూర్తి చేయడం, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, లక్ష్మిరెడ్డి, ఎస్ఏవో రాజేశం, ఏడీలు, ఏ ఈలు, సబ్ ఇంజినీర్లు, ఏపీవోలు పాల్గొన్నారు.

భూగర్భ జలవనరుల శాఖ డీడీగా శ్యాంప్రసాద్

కలెక్టరేట్, ఆగస్టు 3 : భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా శ్యామ్‌ప్రసాద్ నాయక్ బదిలీపై జిల్లాకు వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీడీ శైలశ్రీ మల్లికాదేవి హనుమకొండకు బదిలీ కాగా, ఆమె స్థానంలో నాయక్ ఖమ్మం నుంచి బదిలీ అయ్యారు. అలాగే, ఫీల్డ్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న సుజాత పెద్దపల్లి జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో పెద్దపల్లి నుంచి ఉమాదేవి వచ్చి చేరారు. మాజియా అహ్మద్ సిద్ధిపేటకు బదిలీ కాగా, ఆమె స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి అభిలాష్ జిల్లాకు వచ్చారు.

ఎమ్మెల్యే సతీమణి సంతాప సంస్మరణ సభ

చొప్పదండి, ఆగస్టు 3: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి సంతాప సంస్మరణ సభను శనివారం చొప్పదండి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సభకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, విప్ ఆది శ్రీనివాస్, మైనంపల్లి హనుమంతరావు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, అధికారులు హాజరై రూపాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించి, ఎమ్మెల్యేను పరామర్శించారు. కార్యక్రమంలో ఆరు మండలాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ టెనెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా నారాయణ

హుజూరాబాద్, ఆగస్టు 3: పట్టణంలోని డీసీఎంఎస్ టెనెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా ముశం నారాయణ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా చంద శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మురికి అనిల్‌కుమార్, యంసాని చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా పాకాల రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా గంగిశెట్టి ప్రభాకర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అక్రమ పట్టాను రద్దు చేయాలని వినతి

శంకరపట్నం, ఆగస్టు 3: తమ భూమికి సంబంధించిన అక్రమ పట్టాను రద్దు చేసి, తనకు న్యాయం చేయాలని మొలంగూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు పొద్దుటూరి శంకరమ్మ అధికారులను వేడుకుంది. శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి మండల తహసీల్ కార్యాలయానికి వచ్చి డీటీ రమేశ్‌బాబుకు ఫిర్యాదు చేసింది. తన కొడుకు పొద్దుటూరి వీరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించాడని, అతడి పేరున ఉన్న విలువైన వ్యవసాయ భూమిపై 30 ఏళ్ల క్రితం వీరారెడ్డి నుంచి విడిపోయిన కంకణాల జమున అనే మహిళ కన్ను పడిందని, ఆమె తన ఇద్దరు కూతుళ్ల పేరిట అక్రమంగా పట్టా చేయించిందని ఆరోపించారు. ఇందులో భాగంగా జమున పలు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిందని, ఇందుకు అప్పటి తహసీల్దార్ సహకరించారని ఫిర్యాదు చేశారు. కాగా, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి తమ తమ్ముడి పేరున గల వ్యవసాయ భూమిని ఇతరుల పేరున చేసిన అక్రమ పట్టాను రద్దు చేసి 92 ఏండ్ల తమ తల్లి జీవనోపాధికి వినియోగించాలని వీరారెడ్డి సోదరులు డిమాండ్ చేశారు. అక్రమ పట్టా చేసిన తహసీల్దార్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ శంకరమ్మ కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, మనుమలు ఉన్నారు.

వాణీనికేతన్ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపల్లి, ఆగస్టు 3 : వాణీనికేతన్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఎయిమ్స్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పన్యాల రాకేశ్‌రెడ్డి కంటి పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీ ఎక్కువ సేపు చూడడం ద్వారా కంటి సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ కె. లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దారి మరిచిన బస్సు!

ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఆగస్టు3: ప్రయాణ ప్రాంగణానికి చేరుకొని ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లాల్సిన పల్లెవెలుగు బస్సులు కొన్ని రోజులుగా దారిమరిచాయి. బస్టాండ్‌లోకి రాకుండా నేరుగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపైనే విద్యార్థులు కిక్కిరిసి, బస్సులు ఎక్కుతూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించడం కనిపించింది.

రేపటి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, ఆగస్టు 3 : సోమవారం కలెక్టరేట్‌లో జరుగాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ప్రారంభించనుండడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజలు గమనించాలని కోరారు. తిరిగి వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కార్పొరేటర్

కార్పొరేషన్, ఆగస్టు 3 : కరీంనగర్ నగరపాలక సంస్థ ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో మున్సిపల్ కార్మికులతో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వానకాలం డివిజన్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దనే ఉద్దేశంతో పారిశుధ్య పనులపై ఫోకస్ పెట్టినట్లు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ బదిలీ

తిమ్మాపూర్, ఆగస్టు 3: కరీంనగర్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ సాంబరాజు రాజేశ్ సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉన్నతాధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు. కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. కాగా, బదిలీపై వెళ్తున్న సబ్ రిజిస్ట్రార్ సాంబరాజు రాజేశ్‌ను దస్తావేజు లేఖరులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు మూసా, బండిపెల్లి శ్రీనివాస్, నాగరాజు కృష్ణ, దుర్శేట్టి రమేశ్, చంద్రమౌళి, ఓరుగంటి జనార్దన్, ముద్రకోల అశోక్, పడాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను కేంద్రం ఆదుకోవాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 3: వయనాడ్ వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. బాధితుల కోసం శనివారం నగరంలోని పలు వ్యాపార కూడళ్లలో విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రవి, ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి పాల్గొన్నారు.

బీసీ సభను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 3: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేపట్టాలనే డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న పంజాబ్‌లో నిర్వహిస్తున్న బీసీ సభను విజయవంతం చేయాలని జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం తెలంగాణచౌక్‌లో వాకర్స్ అసోసియేషన్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నాయకులు రవీందర్‌సింగ్, మధుపటేల్, ప్రసాద్‌పటేల్, శ్రీనివాస్ యాదవ్, వెంకన్న పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణతో ఆర్టికల్ 341కి విఘాతం'

శంకరపట్నం, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణతో ఆర్టికల్ 341కి విఘాతం కలుగుతుందని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు, న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు చౌడమల్ల వీరస్వామి అన్నారు. శనివారం వీరస్వామి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ విలువలను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు దళిత సంఘాలు, ప్రజాస్వామ్యవాదులందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం'

ఇల్లందకుంట, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణతో మాలకులస్తులకు అన్యాయం జరుగుతుందని అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణతో మాలలు, మాల ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఇక్కడ మాల సంఘం నాయకులు మాదాసు మొగిలి, చిరంజీవి, దిలీప్, రాజు, రాజేందర్, సాగర్, సాయితేజ ఉన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

చిగురుమామిడి, ఆగస్టు 3: గౌరవెల్లి ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ రామంచ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు వంటకాల సంపత్ రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు దొబ్బల భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన కార్మికులు

విద్యానగర్, ఆగస్టు 3: బకాయి వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కరీంనగర్‌లో రెండు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు శనివారం విరమించారు. అధికారులు రెండు రోజులుగా డీఎంఈతో మాట్లాడి, కార్మికుల ఖాతాల్లోకి శనివారం సాయంత్రం రెండు నెలల వేతనాలు జమ చేయడంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

కలెక్టరేట్/ విద్యానగర్/ గన్నేరువరం/ వీణవంక/ గంగాధర/ కొత్తపల్లి/ తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 3 : జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నగరంలోని కోతిరాంపూర్ సెక్టార్ పరిధిలో గల పోచమ్మవాడ, అహ్మద్‌పుర, కోతిరాంపూర్ 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.విజయ, తిమ్మాపూర్ మండలం రేణికుంట అంగన్‌వాడీ కేంద్రంలో అధికారులు ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చల్మెడ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గన్నేరువరంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి రామానుజాచార్య హాజరై, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. వీణవంక మండలం వీణవంక, అంకూస్‌పల్లి, లస్మక్కపల్లి, రెడ్డిపల్లి, కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్లలో టీచర్లు తల్లులను సమావేశపరిచి, తల్లిపాలలో పోషకపదార్థాల గురించి వివరించారు. గంగాధర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పత్తికుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు, పాల ప్యాకెట్లు అందజేశారు.

నిందితులకు శిక్ష పడేలా సమష్టిగా పని చేయాలి: సీపీ

రాంనగర్, ఆగస్టు 3 : వివిధ ఘటనల్లో నమోదైన కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా పోలీసులు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పని చేయాలని సీపీ అభిషేక్ మొహంతి సూచించారు. శనివారం కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కమిషనరేట్‌లోని పోలీసులు, జిల్లాలోని అన్ని కోర్టులకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ ఘటనల్లో నిందితులపై నమోదైన కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు మొదలు, కేసు విచారణ, కోర్టులో వచ్చే ట్రయల్, తదితర అనేక అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణతో పాటు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వి. లక్ష్మీప్రసాద్, ఏసీపీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దిలో జిలెటిన్ స్టిక్స్ పట్టివేత

మానకొండూర్ రూరల్, ఆగస్టు 3: అనుమతి లేకుండా తరలిస్తున్న జిలెటిన్ స్టిక్స్‌ను పట్టుకోవడంతోపాటు ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మానకొండూర్ సీఐ సదన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కోరిటికల్ గ్రామానికి ఒర్సు శ్రీనివాస్ కొన్నాళ్లుగా వీణవంకలో ఉంటున్నాడు. గత శుక్రవారం ద్విచక్ర వాహనంపై దాదాపు 200 జిలెటిన్ స్టిక్స్‌తో వెల్ది మీదుగా మానకొండూర్ వైపుగా వస్తుండగా, పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అతడిని విచారించగా కేశవపట్నం మండలానికి చెందిన వంగ సత్యనారాయణ వద్ద కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు తెలిపారు. అతడితోపాటు ఇంకా ఈ కేసుతో సంబంధం ఉన్న హుజూరాబాద్ మండలం ఇప్పల నర్సింగాపూర్‌కు చెందిన జున్నోజు రాజేందర్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మానకొండూర్ సీఐ తెలిపారు.

అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం

తిమ్మాపూర్, ఆగస్టు 3: ఉమ్మడి కరీంనగర్ జిల్లా దూప దీప నైవేద్య అర్చక సంఘం ఆత్మీయ సమ్మేళనం మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీ తాపాల లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తిరునగిరి వెంకటాద్రిశర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కావాల్సి ఉండగా.. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్చకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, నాయకులు వింజమూరి సుధాకర్, దేవరాజు ఆంజనేయ శర్మ, కిరణ్‌శర్మ, ఉమ్మడి జిల్లా అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణకు చర్యలు

కలెక్టరేట్, ఆగస్టు 3 : జిల్లాలో నీటి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జలవనరుల శాఖ అధికారి రమేశ్ తెలిపారు. ఆశాఖ పరిధిలోని ఆయా మండలాల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా చెరువులు, కుంటల విస్తీర్ణం రికార్డులు పరిశీలించారు. మ్యాపులు సిద్ధం చేయాలని సూచించారు. మండలాల బాధ్యులు తమ పరిధిలోని చెరువులు, కుంటలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల మార్గదర్శకాలు పాటిస్తూ, గామసభలు నిర్వహించాలన్నారు. ఆ సభల్లో వాటి సంరక్షణపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంచాలి

కలెక్టరేట్, ఆగస్టు 3: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ సత్వరమే పెంచాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోలోజు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పద్మనగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెన్షన్ పెంపుపై వెంటనే మంత్రివర్గం దీనిపై ప్రకటన చేయాలని, లేనిపక్షంలో సీఎం, మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో దివ్యాంగ నాయకులు ప్రణీత్ మహారాజ్, సారయ్య, శైలేందర్‌కుమార్, జంగిటి రాములు, ఒద్దమల్ల రామయ్య, వెంకటలక్ష్మి, రమాదేవి, జానకితో పాటు పలు మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఆగస్టు 3: విద్యుత్ తీగల కిందున్న చెట్ల కొమ్మల తొలగింపు, ట్రాన్స్ ఫార్మర్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9.30నుంచి 10.30గంటల వరకు మెహర్ నగర్, సీతారాంపూర్‌లో కొంత ప్రాంతం, డీ మార్ట్, వరలక్ష్మీ నగర్, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతానికి విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-1 ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హుజూరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో..

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 3: హుజూరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని గణేశ్ నగర్ ఫీడర్‌లో మామిండ్లవాడ, అన్నపూర్ణ థియేటర్, జమ్మికుంట రోడ్డు, సూపర్ బజార్ రోడ్డు, రెడ్డి కాలనీ, కేరళ స్కూల్ రోడ్డులో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

దుర్శేడ్‌లో విషజ్వరంతో యువకుడు మృతి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 3: దుర్శేడ్ గ్రామంలో ఓ యువకుడు విషజ్వరంతో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇరుకుల్ల అజయ్(35) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీషలతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కాగా, ఇటీవల డెంగ్యూ బారిన పడిన ఓ వ్యక్తి ఇంటి సమీపంలోనే అజయ్ నివాసం ఉండడంతో స్థానికులు డెంగ్యూతోనే మృతి చెందినట్లు పేర్కొంటున్నారు. అయితే అజయ్ గుండెపోటుతో మృతి చెందాడని చామనపల్లి ప్రాథమిక వైద్యశాల డాక్టర్ మనోహర్ తెలిపారు.

టెండర్ ప్రకటన

KITS College సింగాపూర్, హుజూరాబాద్ తేది: 09-8-2024 నుండి 18-08-2024 వరకు NCC క్యాంపులో Grocery: బియ్యం, పప్పు, మసాల దినుసులు, కూరగాయలు సప్లై చేయుటకై టెండర్లు కోరడమైనది. ఆసక్తి గలవారు తమ కొటేషన్‌ను CO 9 (T) బెటాలియన్ పేరిట తేది:07-08-2024 వరకు ఇవ్వవలసినదిగా కోరడమైనది.

చిరునామా: NCC Office, Near D-Mart Road, Karimnagar. Cell: 70850 56800

PUBLIC NOTICE

The general public are here by informed that, my client Eegam Santhosh, S/o. Eegam Bhoomaiah, Aged about 42 years, Occ: Business, Mobile No: 9553123400, R/o: H.No: 6-5-182, Karkhanagadda, Karimnagar, Telangana-505 001 is purchasing a part of Open Plot No. 35 bearing Survey No. 252/అ, admeasuring 92 Sq.yards or equivalent to 77.28 Sq.mts., situated at Teegala Gutta Palle, Arapally Revenue Village, Karimnagar Town (within the limits of Municipal Corporation of Karimnagar) and under the Jurisdiction of Sub-District, Karimnagar (R.O.) and bounded by NORTH: Plot No. 35 (part) of Gaddam Laxmi Narayana, SOUTH: Plot No. 35 (part) of Adluri Srinivasa Raju, EAST: 60'-0" wide Road, WEST: Land belongs to E.Venkatesham from Odapalli Vijay, S/o. Sailu, Aged about 39 years, Occ: Business, R/o: H.No. 10-5-147, Kisan Nagar, Karimnagar.

Any person or persons having any objection/s, charge, claim, lien over the said land shall approach the under signed office within **one week** from the day and date of this publication. No objections or claim will be entertained after the said period.

Sd/- I . Sharath Kumar, Advocate
O/o: H.No. 2-58/2/10/A/1, Flat No. 101,
Vishnu Priya Residency, Manair Nagar,
Road No. 1, Padmanagar, Karimnagar Town,
Mobile: 9866366933.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ప్రముఖ కార్పొరేట్ కాలేజ్ నందు పని చేయుటకు మార్కెటింగ్ అనుభవంగల యువతీ యువకులు కావలెను. జీతం: 35K+TA, అర్హత: గ్రాడ్యుయేషన్, ఏరియా: కరీంనగర్ మరియు పరిసర ప్రాంతాలవారు సంప్ర: 7731069689.
NT-332611

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325779-All

TO-LET

★కరీంనగర్ నుండి పెద్దపల్లికి పోయేటప్పుడు 100 ఫీట్ల త్రోవకు బొమ్మకల్ ఫ్లైఓవర్ దగ్గర, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపుకు ఎదురుగాగల బిల్డింగ్‌లో క్రింద షట్టర్ మరియు పైన 2BHK ఫ్యామిలీ పోర్షన్ కిరాయికి ఇవ్వబడును. Ph: 9390978999 / 7702388808.
NT-331217

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc. మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును. డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

RENT / LEASE

★అల్గునూర్‌లో పరమిత ఐరిస్ వరల్డ్ స్కూల్ యొక్క కాంపౌండ్ గోడను ఆనుకొని 30 గుంటల కమర్షియల్ ల్యాండ్ కిరాయికి లేదా లీజుకు ఇవ్వబడును. Ph: 9390978999 / 7702388808.
NT-331218

RENT / LEASE

★అల్గునూర్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం దగ్గర 30 ఫీట్ల రోడ్‌కు 25 గుంటల భూమిని కిరాయికి లేదా లీజుకు ఇవ్వబడును. Ph: 9390978999 / 7702388808.
NT-331219

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194